ప్రజా న్యూస్ నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. తెలుగు దినపత్రిక
ఆదివారం 13-09-2026

మొదటి పేజి తరువాయి

## సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## డీఎస్సీపై ఫేక్ ప్రచారం - పెద్ద అప్పలరాజు ఉద్యోగంపై లోకేశ్ క్లారిటీ

డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని లోకేశ్ మండిపడ్డారు. ఆయన సెమీఫైనల్ పోరాటానికి సంబంధించిన వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించే ప్రచారాన్ని జగన్ ఇప్పటికైనా ఆపాలని హితవు పలికారు. అసలు వాస్తవాన్ని ప్రజలకు తెలియజేసేలా పెద్ద అప్పలరాజుపై ఫేక్ ప్రచారం అసలు వాస్తవం పేరుతో లోకేశ్ ఎక్స్ వేదికగా వీడియోను రిలీజ్ చేశారు. విమర్శించే స్థాయి కొడాలి నానికి లేదని మంత్రి వాసంశెట్టి సుభాశ్ విమర్శించారు. 7వ తరగతి కూడా పాస్ కాని నానికి విద్యారంగం, డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వచ్చే దమ్ము వైఎస్సార్సీపీ నేతలకు లేదని ఆక్షేపించారు. 11 సీట్లకు ఘోరంగా పడిపోయినా జగన్ కు ఇంకా బుద్ధి రాలేదని, కొడాలి నాని లాంటి నేతల వల్లే ఆ పార్టీ ఘోర పరాజయం పాలైందని పేర్కొన్నారు.

## దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

## అన్ని సౌకర్యాలు అందిస్తాం, భక్తితో గణనాథుడిని పూజిద్దాం

ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

### మండపాల సమాచారం ముందుగానే ఇవ్వాలి

ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మల కుంటలు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ హాజరయ్యారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతమయ్యాయి

విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

## తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన

ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

### ఆరోగ్య శాఖ హెచ్చరిక

వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## రూ.253 కోట్లతో అమరావతిలో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ



హైదరాబాద్ :రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

## ఏపీలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయండి..

మొదటి పేజి తరువాయి



అమరావతి, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు. ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని మార్గనిర్దేశం చేశారు. వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అప్రమత్తం చేశారు. గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అలర్ట్ చేశారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

మొదటి పేజి తరువాయి

### ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఆ భూములను పొరపాటున 22ఏలో చేర్చారు

నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. "దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ, భూములు మాత్రం ఉండేవి కాదు. ధరణి చట్టం తెచ్చి తమ బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారు. భూమిలేకుండానే ఆ పాసుపుస్తకాలకు కోట్ల రూపాయల రైతుబంధు ఇచ్చారు. భూమిలేని వారికీ రైతుబంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనం కొల్లగొట్టారు. అసలు అసెంబ్లీ ఇక్కడ నిర్వహిస్తుంటే మాక్ అసెంబ్లీ ఎందుకు? అసెంబ్లీకి రాకుండా మాక్ అసెంబ్లీ పెట్టుకుని అక్కడ డ్రామాలు ఆడుతున్నారు"- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి

### కోట్ల మంది వివరాలు విదేశీ సంస్థలో చేతిలో పెట్టారు

కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్‌ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు



చేస్తామని స్పష్టం చేశారు.

### ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని వేలాది ఎకరాలు చెరబట్టారు

ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

## దిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

మొదటి పేజి తరువాయి

ఈ జాయింట్ డిక్లరేషన్ ఆమోదం పొందినట్లు తాజాగా అధికారికంగా ప్రకటించారు.

### పాత వ్యవస్థలు ఇక పనికిరావు!

ఈ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో కరచాలనం చేస్తూ కనిపించారు. సదస్సు ముగింపు ఉపన్యాసంలో మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మారుతున్న ప్రపంచాన్ని పాతపడిపోయిన వ్యవస్థలు నడపలేవు. నేటి చర్చల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పనలో కచ్చితంగా సంస్కరణలు అవసరం. అలాగే భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో, వాటి నియంత్రించే నిబంధన రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని మేము నొక్కి చెప్పాము. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని- భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణ ద్వారా మాత్రమే పూడ్చగలం. ఈ రోజు ఆమోదించిన దిల్లీ డిక్లరేషన్ మన ఉమ్మడి సంకల్పానికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చవలసిన



బాధ్యత ఇప్పుడు మనందరిపైనే ఉంది" అని మోదీ పేర్కొన్నారు.

భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు

ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్ , ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.

డాలర్ కు బదులుగా సొంత కరెన్సీలతో వాణిజ్యం

వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వాస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

సుమారు 30 నగరాల్లో మీ బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది. బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ఇందులోని సభ్యదేశాల ప్రజలకు మనం భరోసా కల్పించాలి. పరస్పర సహకారంతో బ్రిక్స్ దేశాలు మరి అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా అంతర్జాతీయ సమస్యలకు మనం పరిష్కారం చూపించాల్సి ఉంది. మనం వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కాలం కావాలి. అంతేకాదు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కూడా సంస్కరణలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఘర్షణలను పరిష్కారం చూపించాలి. ఇందుకోసం మనం ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. అలాగే ఏఐ, సైబర్ స్పేస్ , బయోటెక్నాలజీ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలి. అంతేకాదు గ్లోబల్ సౌత్ దేశాలకు దిశానిర్దేశం చేయాలి' అని మోదీ అన్నారు.

బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు!

"మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇదొక చారిత్రాత్మక మైలురాయి. మానవ జీవితంలో 20ఏళ్ల వయస్సు అనేది పరిణితి, బాధ్యతతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. ఇది బాధ్యతలు, ఆకాంక్షలతో ముడిపడే, సామర్థ్యాలను కొత్త దిశను కనుగొనే దశ. నేడు బ్రిక్స్ కూడా సరిగ్గా ఇలాంటి పరిణితి చెందిన దశలోనే ఉంది. మనం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మన విధానం ఎవరికీ వ్యతిరేకం కాదు. అందరినీ కలుపుకుపోవడమే మన లక్ష్యం. ఇప్పుడు బ్రిక్స్ దేశాల ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైంది."

- ప్రధాని నరేంద్ర మోదీ

సంస్కరణలు చేపట్టాల్సిందే! రానున్న 20 ఏళ్ల కోసం ఒక సరికొత్త, ప్రతిష్ఠాత్మకమైన ఎజెండాను రూపొందించాలని ప్రధాని మోదీ బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. "బ్రిక్స్ అధ్యక్ష పదవి ఏటా మారుతున్నప్పటికీ, అది మన సంస్థాగత వేగానికి ఆటంకం కలగకూడదు. ఇందుకోసం మన ఒక ప్రత్యేకమైన పర్యవేక్షణ వ్యవస్థను (ట్రోయ్కా-ఆతీశీఙముఖ ఖతీతీఖఅస్త్రవఎవత్) ఏర్పాటు చేయాలి. దీని వల్ల ఫలితాలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలు కలుగుతుంది. అలాగే ప్రతి నిర్ణయానికి సంబంధించిన నోడల్ పాయింట్ , కాలపరిమితి, పని ఎంత వరకు వచ్చిందో రికార్డు చేయడానికి ఒక సురక్షితమైన రిపోజిటరీ (డిజిటల్ స్టోరేజ్ )ని ఏర్పాటు చేయాలి" అని మోదీ అన్నారు.

### బ్రిక్స్ మరింత బలోపేతం

"బ్రిక్స్ ను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రపంచ సంస్కరణల కోసం మనం ఒక మార్గాన్ని కూడా సుగమం చేయాలి. ప్రస్తుత ప్రపంచ పాలనా విధానం (గ్లోబల్ గవర్నెన్స్ ) నిర్మాణం ఒక పిరమిడ్ లా ఉంది. అధికారం, నిర్ణయాధికారాలు కేవలం పైనున్న కొన్ని దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కింది శ్రేణిలో ఉన్న



దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితమవుతున్నప్పటికీ, వాటిని మార్చగల శక్తి వాటికి లేదు. అందుకే ఈ పద్ధతి మారాలి. ఇందుకోసం సంస్కరణలు చేపట్టాలని" మోదీ పేర్కొన్నారు.

ఉమ్మడి ప్రకటన

కాగా, ఈ రోజు బ్రిక్స్ దేశాలన్నీ కలిసి ఒక ఉమ్మడి ప్రకటన చేయనున్నాయి. శనివారం జరిగిన సుదీర్ఘమైన చర్చల తర్వాత బ్రిక్స్ దేశాలు ఓ ఏకాభిప్రాయానికి వచ్చాయి. పలు వివాదాస్పద అంశాలపై భేదాభిప్రాయాలు వ్యక్తమయినప్పటికీ, భారత్ నిరంతర చర్చలు, సంప్రదింపుల ద్వారా సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఇరాన్ , సౌదీ అరేబియా, యూఏఈ మధ్య ప్రాంతీయ, భౌగోళిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, వారంతా ఒకే వేదికపైకి వచ్చి ఈ ఉమ్మడి ప్రకటనకు అంగీకరించేలా చేయడంలో భారత్ విజయం సాధించింది.

## బ్రిక్స్‌లో భారత్ దౌత్య బలం చూపించాలి'- మోదీ సర్కార్‌కు కాంగ్రెస్ కీలక సూచనలు

గ్లోబల్ సౌత్‌లో భారత్‌పై నమ్మకం పెంచాలన్న కాంగ్రెస్ ఇరాన్ విషయంలో ఉన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాలన్న హస్తం పార్టీ

సమ్మిట్ వివరాలపై మోదీ ప్రెస్‌మీట్ పెట్టాలని డిమాండ్

: బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు.

ఇరాన్ విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందే!

ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

బ్లాక్ రాజకీయాలకు దూరంగా!

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు,

# గ్రామ ప్రజా ఆరోగ్యమే మా ధ్యేయం..

### -గుడిపల్లి సర్పంచ్ రాజా శేఖర్ రెడ్డి

### -యశోద ఆస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు.

దేవరకొండ,గుడిపల్లి, సెప్టెంబర్ 12 జెట్టి శంకర్ యాదవ్ ప్రజా న్యూస్.నల్లగొండ జిల్లా గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా ఉచిత హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు.గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రముఖ యశోద హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. డాక్టర్లు వీరారెడ్డి,ఆర్థో నిపుణులు అమీరా గైనకాలజిస్ట్, మధుర దుర్గా మరియు వారి బృందం గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు.

ఈ క్యాంప్ లో భాగంగా కంటి పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు గైనక్ పరీక్షలు, ఈసీజీ,బీపీ , షుగర్ పరీక్షలు పూర్తి ఉచితంగా నిర్వహించారు. అంతేకాకుండా అవసరమైన వారికి కళ్ళద్దాలు, మందులను కూడా






ఉచితంగా పంపిణీ చేశారు. ఒకవేళ ఎవరికైనా మేజర్ హెల్త్ ప్రాబ్లం ఉంటే, క్యాంప్ లో ఇచ్చిన ఓపి స్లిప్ తీసుకువస్తే యశోద హాస్పిటల్ లో 20% డిస్కౌంట్ ఇస్తామని వైద్యులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ కూన్రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "మా గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం అడగగానే ఉచిత క్యాంప్ నిర్వహించడానికి ముందుకు వచ్చిన యశోద హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ఒక్కరోజే దాదాపు 500 మంది గ్రామస్తులు ఈ సేవలను వినియోగించుకున్నారు. మా ప్రజలకు ఎలాంటి హాని జరగకూడదనే ముందు జాగ్రత్తగా ఈ చెకప్ లు చేయిస్తున్నాం. అలాగే మా పాఠశాలలో విద్యార్థులకు ప్రతి వారం చికెన్ కూడా అందిస్తున్నాం" అని తెలిపారు.గ్రామస్తులు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది పురస్కారం




సెప్టెంబర్ 12 ఎల్కతుర్తి (ప్రజా న్యూస్ నెట్వర్క్): ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందనం, ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా కళలు, సాహిత్యం, సంస్కృతి, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ మంత్రి శ్రీ సముద్రాల వేణుగోపాలచారి హాజరై పలువురు ప్రముఖులను సత్కరించారు.ఉపాధ్యాయులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులను గౌరవిస్తూ గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి (అర్చక పురోహితులు, వాస్తు--జ్యోతిష్య పండితులు)ను సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న సేవలను గుర్తిస్తూ స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.ఆధ్యాత్మిక, ధార్మిక, వాస్తు, జ్యోతిష్య రంగాల్లో సేవలందిస్తూ ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తున్న సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది పురస్కారం లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను




పెంచిందని, సమాజానికి తన వంతు సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు.కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు.తనకు స్వర్ణ నంది పురస్కారం అందజేసి ఆత్మీయంగా సత్కరించినందుకు కళానిలయం సాంస్కృతిక సంఘ సంస్థ నిర్వాహకులు, ఏ. సురేందర్ గారికి శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, కళానిలయం సభ్యులు, ఉపాధ్యాయులు, అభిమానులు పాల్గొన్నారు

# కోదాడ నియోజకవర్గంలో వినాయక ఉత్సవాలకు కఠిన నిబంధనలు

### -డీజేలు, క్రాకర్స్‌కు నో.. రోడ్లపై విగ్రహాలు పెడితే కఠిన చర్యలు

### .- 27 సూచనల ద్వారా ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ చర్యలు :

(కోదాడ నియోజకవర్గం) సెప్టెంబర్ 12, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీసులు కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందన్‌లాల్, ఎస్పీ కొత్తపల్లి నరసింహ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు శివశంకర్, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు మండపాల నిర్వాహకులకు 27 కీలక సూచనలు జారీ చేశారు. డీజేలు, క్రాకర్స్‌కు అనుమతి లేదని, ప్రతి మండపాన్ని పోలీసుల సూచించిన విధానంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

**రోడ్లపై విగ్రహాలు పెడితే కఠిన చర్యలు తప్పవు :**

రోడ్లపై ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వినాయక విగ్రహాలు లేదా మండపాలు ఏర్పాటు చేయరాదని పోలీసులు హెచ్చరించారు. కోదాడ పట్టణ ఎస్‌ఐలు అజయ్ కుమార్, ఉపేందర్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ షేక్ యాకూబ్, నడిగూడెం ఎస్‌ఐ ఏ.తేజస్విని, మోతే ఎస్‌ఐ లచ్చిరెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ బండి మోహన్, అనంతగిరి ఎస్‌ఐ, మునగాల ఎస్‌ఐ మల్లు సంజీవ రెడ్డి తమ పరిధిలో నిబంధనలను అమలు



చేయనున్నారు. అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఈసారి ఎలాంటి మినహాయింపులు ఉండవని, కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

# నందమూరి అభిమానుల స్టేట్ కన్వీనర్ జీఎల్ శ్రీధర్‌కు ఘన స్వాగతం

### -కోదాడలో భారీగా తరలివచ్చిన అభిమానులు.. పుష్పగుచ్ఛాలతో అభినందనలు

### -అభిమానుల ఐక్యత, సేవా కార్యక్రమాలపై చర్చ

(కోదాడ మండలం), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధితిరుపతిలో దేవదర్శనం ముగించుకుని కోదాడ మీదుగా వెళు_న్న నందమూరి అభిమానుల స్టేట్ కన్వీనర్ జీఎల్ శ్రీధర్‌కు కోదాడలోని తారా టీ స్టాల్ వద్ద నందమూరి అభిమానులు ఘన స్వాగతం పలికారు. బాలకృష్ణ అభిమాన సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు తూనం వెంకటేశ్వర్లు, కోదాడ టౌన్ అధ్యక్షుడు షేక్ మీరాసాహెబ్ ఆధ్వర్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా అభిమానుల ఐక్యత, సంఘాల బలోపేతం, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొనగా, జీఎల్ శ్రీధర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



# అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు.

### - విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి.

### -రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులపై ముందస్తు అరెస్టులు..

### -ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్..

దేవరకొండ, సెప్టెంబర్ 12,జెట్టి శంకర్ యాదవ్. ప్రజా న్యూస్.

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 12-09-2026న విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులపై ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం..విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి, వాటి గురించి ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులను అర్ధరాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తూ అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం ఏబీవీపీ ఎప్పటినుంచో విద్యార్థుల హక్కులు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా రంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహిస్తోంది. ఇటువంటి అక్రమ అరెస్టులతో ఉద్యమ స్ఫూర్తిని అణచివేయలేరుప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏబీవీపీ ప్రజాస్వామ్యబద్ధంగా తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని తెలియజేస్తున్నాము అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు అని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ తెలియజేశారు ఈ అరెస్టులో కటకం ప్రవీణ్, ఎయిర్టెల్ మహేందర్ తదితరులు ఉన్నారు.




# టి వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 12

తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి వై జె ఎఫ్) సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా జన్మదిన వేడుకలు శనివారం సంగారెడ్డి సన్ రైస్ హాస్పిటల్ పక్కన ఉన్న ఆర్ స్ట్రీట్ రెస్టారెంట్‌లో ఘనంగా నిర్వహించారు.టి వై జె ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మెహబూబ్ ఆధ్వర్యంలో గజ మాల తో సత్కరించి జన్మదిన వేడుకలు జరిపారు..ఈ సందర్భంగా సంతోష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, టి వై జె ఎఫ్ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువత సంక్షేమం కోసం, సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో టి వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మెహబూబ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కామగల్ల నరేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి జెల్ల బాగయ్య, పట్టణ ఉపాధ్యక్షులు ఎర్ర మహేందర్ తదితరులు పాల్గొన్నారు..




# హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉచితంగా వినాయక విగ్రహాల పంపిణీ :

### గరిడేపల్లి, పాలకీడు, నేరేడుచర్ల మండలాలకు 180 విగ్రహాల అందజేత :

### వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సహకారం :

(హుజూర్‌నగర్ మండల), సెప్టెంబర్ 12, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి, పాలకీడు, నేరేడుచర్ల మండలాలకు బీఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో శనివారం సుమారు 180 వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులకు విగ్రహాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# స్కూల్ గేమ్స్‌లో మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల సత్తా

### -వాలీబాల్, ఖోఖోలో అండర్-17 విభాగంలో ప్రథమ స్థానాలు

### -అండర్-14 ఖోఖోలోనూ విజయం.. విద్యార్థులకు అభినందనలు



(చిలుకూరు మండలం), సెప్టెంబర్ 12, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :చిలుకూరు మండలం రామాపురం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-17 విభాగంలో వాలీబాల్, ఖోఖోలో ప్రథమ స్థానాలు సాధించగా, అండర్-14 ఖోఖోలోనూ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరయ్య అభినందించారు. విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, మట్టయ్య, లెనిన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏటీపీ బ్రహ్మచారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టంపల్లి బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

**భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు.. భద్రతపై అధికారులకు కీలక సూచనలు**

**క్రేన్లు, గజ ఈతగాళ్లు, అంబులెన్స్, బారికేడ్ల ఏర్పాటుకు ఆదేశాలు**

( మఠంపల్లి మండల), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :మట్టంపల్లి మండలంలోని కృష్ణా నది వద్ద గల మట్టంపల్లి బ్రిడ్జి నిమజ్జన ఘాట్‌ను హుజూర్‌నగర్ సర్కిల్ సీఐ ఆధ్వర్యంలో అధికారులు శనివారం పరిశీలించారు. సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరిగే వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లు, అంబులెన్స్, సేఫ్టీ నెట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లకు సహకరించాలని ఎన్‌సీఎల్, సాగర్ సిమెంట్ యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఫైర్ అధికారులు, సర్పంచ్, ఎన్‌సీఎల్ ప్రతినిధులు, ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.




# నేడు కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన

**అభివృద్ధి పనుల పరిశీలన.. జాబ్‌మేళా ఏర్పాట్లపై సమీక్ష**

**యంగ్ ఇండియా పాఠశాలలు, సాగునీటి పథకాల పనులపై కీలక సమీక్షలు**

(కోదాడ మండల), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నేడు కోదాడలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. హైదరాబాద్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులపై సమీక్ష అనంతరం కోదాడలో ఈ నెల 19న జరగనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం షాదీఖానా, ఈద్గా కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ అతిథి గృహం, నీటిపారుదల కార్యాలయ భవనాలు, భూగర్భ మురుగునీటి పారుదల పనులను పరిశీలిస్తారు. రూ.610 కోట్ల మోతె ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పోలీసు అధికారులతో వీడియో సమావేశం, సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశంలో పాల్గొంటారు.



# చలో యాదగిరిగుట్ట.. ఉద్యమకారులు భారీగా తరలిరావాలి

**ఈ నెల 27న ఉద్యమకారుల సమావేశం.. పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ చీమ శ్రీనివాస్**

**సూర్యాపేట జిల్లా నుంచి వెయ్యి మందికి పైగా తరలివస్తారు: గుండెపంగు రమేష్**

(కోదాడ మండల), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : కోదాడ పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఉద్యమకారుల సమావేశం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం కోసం ప్రభుత్వం హామీలను త్వరగా అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు 20 శాతం టికెట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను కోరారు. సూర్యాపేట జిల్లా నుంచి వెయ్యి మందికి పైగా ఉద్యమకారులు యాదగిరిగుట్ట సభకు తరలివస్తారని జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావుతో పాటు పలువురు ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు.




# ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు

**ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు.. ఒకరిని రక్షించిన స్థానికులు**

**పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు.. శోకసంద్రంలో కుటుంబ సభ్యులు**

(కోదాడ మండలం),ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : మునగాల మండలం ముకుందాపురం గ్రామంలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. రెండో శనివారం సెలవు కావడంతో మిత్రుడు అనుదీప్‌ను కలిసేందుకు వచ్చిన కోదాడ పట్టణానికి చెందిన హరీష్ నాయుడు, గుడిబండ గ్రామానికి చెందిన లేకస్వరూప్ మరో విద్యార్థితో కలిసి కాలువలోకి ఈతకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో హరీష్ నాయుడు, లేకస్వరూప్ గల్లంతుకాగా, మరో విద్యార్థిని స్థానికులు రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థుల ఆచూకీ కోసం కాలువ నీటిని తగ్గించి గాలిస్తున్నారు. ఘటనతో విద్యార్థుల కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్నారు.









# జగ్గారెడ్డిని కలిసిన విద్యార్థిని భవాని..

**భూమి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన జగ్గారెడ్డి**

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 12.. రాయికోడ్ మండలం కప్పాడ్ గ్రామానికి చెందిన విద్యార్థిని శివాని తన తల్లిదండ్రుల రెండున్నర ఎకరాల భూమి సమస్యను పరిష్కరించి చదువును కొనసాగించాలనే ఆశతో కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డిని కలిశారు. ప్రస్తుతం~ాజజూ కోర్సు చదువుతున్న శివాని ఆర్థిక ఇబ్బందులతో గత ఆరు నెలలుగా చదువుకు దూరంగా ఉన్నారు.

జగ్గారెడ్డిని కలిసే సందర్భంగా పది రోజుల పాటు శ్రమించి రూపొందించిన థ్రెడ్ ఆర్ట్ చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. అనంతరం తన కుటుంబానికి చెందిన భూమి గత 12 ఏళ్లుగా వివాదంలో ఉండి, రెవెన్యూ అధికారుల వద్ద సమస్య పెండింగ్‌లో ఉందని వివరించారు. భూమి సమస్య పరిష్కారమైతే తిరిగి చదువు కొనసాగించి తన లక్ష్యాన్ని చేరుకుంటానని తెలిపారు.

శివాని పరిస్థితిని తెలుసుకున్న జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి భూమి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చదువును మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలని ఆమెను ప్రోత్సహించారు

# హుజూర్‌నగర్‌లో వాహనాల తనిఖీలు

**-మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌పై పోలీసుల నిఘా**
**-ఇందిరా చౌక్ వద్ద ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు**

(హుజూర్‌నగర్ పట్టణం), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధి : హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద శనివారం ఎస్ఐ చలికంటి నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.




# మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ: ఎస్పీ నరసింహ

**-ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి**
**-జల కాలుష్యాన్ని అరికట్టి నీటి వనరులను కాపాడాలి**

(సూర్యాపేట జిల్లా), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్.అబ్దుల్ రజాక్,జిల్లా ప్రతినిధి :గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ నరసింహ సూచించారు. ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా జల కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉత్సవ నిర్వాహకులను కోరారు.





# అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌కు కోదాడ క్రికెట్ అకాడమీ నుంచి 12 మంది ఎంపిక

**-మేకల అభినవ్ స్టేడియంలో ప్రతిభ చాటిన క్రీడాకారులు**

**-జిల్లా స్థాయి లీగ్‌కు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు**

(కోదాడ మండల), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌కు కోదాడ క్రికెట్ అకాడమీకి చెందిన 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. నల్గొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచి లీగ్‌కు ఎంపికైనట్లు అకాడమీ కోచ్ షేక్ సిద్ధిక్ తెలిపారు. ఎంపికైన వారిలో మణి సుందర్, అనీష్, హరి గోపాల్, నవదీప్, మురారి, హిందూ వర్ధన్, నూర్, మహాదేవ్, యోగేశ్వర్, లలిత్, అయాజ్, హితేష్ ఉన్నారు. జిల్లా స్థాయి లీగ్‌లో రాణించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోచ్ ఆకాంక్షించారు. క్రీడాకారుల ఎంపికపై అకాడమీ నిర్వాహకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ

**-ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి**
**-జల కాలుష్యాన్ని అరికట్టి నీటి వనరులను కాపాడాలి: సీఐ, ఎస్సైలు**







(హుజూర్‌నగర్ మండల), సెప్టెంబర్ 12,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని హుజూర్‌నగర్ సర్కిల్ సీఐ చరమంద రాజు, పట్టణ ఎస్సై చలికంటి నరేష్, రూరల్ ఎస్సై హనుమాన్ నాయక్ సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. మట్టి విగ్రహాలతో జల కాలుష్యాన్ని తగ్గించి నీటి వనరులను కాపాడుకోవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు

# కాలం చెల్లిన సోడాల విక్రయం ప్రజల ప్రాణాలతో చెలగాటం

**గడువు తీరిన సోడాలతో వాంతులు, తీవ్ర కడుపునొప్పి**

**కాసుల కక్కుర్తి ప్రజల ఆరోగ్యం పట్టదా**

**ఫుడ్ సేఫ్టీ అధికారులు నిద్రమత్తు వీడేనా**

అనంతసాగరం సెప్టెంబర్ 12 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :

నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిల గ్రామ బస్టాండ్ సెంటర్‌లోని ఒక దుకాణంలో కాలం చెల్లిన కిన్లే సోడాలను బహిరంగంగా విక్రయిస్తున్నారు. సదరు 'కిన్లే సోడా' బాటిళ్లపై ఉన్న గడువు తేదీ 17/06/2026 ముగిసిపోయినా, వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోకుండా అమాయక ప్రజలకు అంటగడుతుండడం గమనార్హం. ఈ సోడాలు తాగిన పలువురికి కడుపులో వికారం, తీవ్రమైన వాంతులు, కడుపునొప్పి వస్తుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. కాలం చెల్లిన పానీయాలు తాగడం వల్ల ఆరోగ్యానికి తీవ్ర హాని జరుగుతుందని తెలిసినా, దుకాణ యజమానులు కేవలం తమ జేబులు నింపుకోవడానికే చూస్తున్నారు తప్ప ప్రజల ప్రాణాలపై కనీస శ్రద్ధ చూపడం లేదు. ఈ వ్యవహారంపై ఆహార భద్రతా అధికారులు వెంటనే స్పందించి సోమశిల బస్టాండ్ సెంటర్‌లోని షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు సత్వరమే రంగంలోకి దిగితే ఈ దుకాణంలో ఉన్న మరిన్ని కాలం చెల్లిన ఆహార పదార్థాల అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ప్రజారోగ్యంతో వ్యాపారం చేస్తున్న దుకాణదారుడిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని సోమశిల గ్రామవాసులు డిమాండ్ చేస్తున్నారు.

